



కొత్త రోడ్ల నిర్మాణానికి పక్కా ప్రణాళిక

- పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో హ్యామ్ మోడల్ రోడ్లు
- జిల్లాలో 182 రోడ్ల గుర్తింపు
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.135 కోట్లతో రోడ్లకు ప్రాధాన్యత
- సీఆర్‌ఆర్ కింద బీటీ, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.44.83 కోట్లు
- మెయింటనెన్స్ రూరల్ రోడ్స్ కింద రూ. 18.54 కోట్లు
- ఎన్‌ఐసీ ద్వారా చెల్లింపులు

నిర్మల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామీణరోడ్లకు ఇక మహర్దశ పట్టబోతోంది. ఇందులో భాగంగానే పంచాయతీరాజ్ శాఖతో పాటు ఉపాధిహామీ పథకం కింద పెద్దఎత్తున కొత్త రోడ్ల నిర్మాణంతో పాటు పాత రోడ్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ప్రధానంగా హైబ్రిడ్ హర్యామాటీ మోడ్ (హెచ్ఎయం) పథకం కింద జిల్లాలో 182 రోడ్లను గుర్తించారు. మొత్తం జిల్లాలో 700 కిలోమీటర్లకు పైగా హ్యామ్ రోడ్లను చేపట్టనున్నారు. దీని కోసం గానూ రాష్ట్రస్థాయిలోని కన్సల్టెన్సీ సంస్థ అంచనాలను రూపొందిస్తోంది. అలాగే ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రోడ్లు తదితర పనులను చేపట్టేందుకు రూ.135 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పథకం కింద మొత్తం 2407 పనులు చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు 719 పనులు పూర్తయ్యాయి. దీని కోసం గాను రూ.47 కోట్లను ఖర్చు చేశారు. ఈ పనులన్నింటిని వేసవి చివరివారం వరకు పూర్తి చేసి అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధానంగా ఓ గ్రామం నుంచి మండల కేంద్రానికి మండలం నుంచి జిల్లా కేంద్రానికి జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధాని వరకు రోడ్డు సౌకర్యం కల్పించడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకుంటున్నారు. చాలా ఏళ్ల నుంచి జిల్లాలో రోడ్లనిర్మాణం కోసం గత ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయకపోవడంతో అన్ని రోడ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. పంచాయతీరాజ్ శాఖ అధికారులతో పాటు ఆర్ అండ్ బి తదితర శాఖలు రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించడం ఆ ప్రతిపాదనలు సర్కారుకు నివేదించడం సర్వసాధారణంగా మారింది. అయితే ప్రభుత్వం సంబంధిత శాఖల అధికారుల ప్రతిపాదనలను పక్కన పెట్టి నిధులను మంజూరు చేయకపోతుండడం గ్రామీణ రోడ్లకు శాపంగా మారుతోంది. దాదాపు ఏడు ఎనిమిది సంవత్సరాల నుంచి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోతుండడంతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించడం కూడా నిలిపివేసి పాత ప్రతిపాదనలపైనే మల్లగుల్లాలు పడేవారు. కొన్నిశాఖల్లో నిధులు లేక అధికారులు సైతం ఆఫీసులకు పరిమితమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా గ్రామీణరోడ్లపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తుండడంతో ఏళ్ల నాటి సమస్యకు క్రమంగా పరిష్కార మార్గం లభించబోతోందని అంటున్నారు. వివిధ రకాల స్కీంలతో చేపట్టబోయే రోడ్ల కారణంగా గ్రామీణ ప్రాంతాల రాకపోకలకే కాకుండా పూర్తిస్థాయి కనెక్టివిటీకి అవకాశం ఏర్పడబోతోందని అంటున్నారు. రవాణా రంగం ఈ కొత్త రోడ్ల నిర్మాణం కారణంగా పురోగాభివృద్ధి సాధించే అవకాశాలున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సీఆర్‌ఆర్ కింద కొత్త రోడ్లు

కాగా జిల్లాలో కన్స్‌క్షన్స్ ఆఫ్ రూరల్ రోడ్డు పథకం కింద మొత్తం 115 రోడ్లను కొత్తగా నిర్మించాలని తలపెట్టారు. దీని కోసం గానూ రూ.44.83 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. కాగా ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లోని బీటీ, సీసీ రోడ్లను నిర్మించ తలపెడుతున్నారు. ఈ సారి ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం అన్ని రకాల రోడ్ల నిర్మాణానికి సంబంధించిన స్కీంలను యుద్ద ప్రతిపాదికన చేపట్టాలంటూ జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేయడంతో సంబంధిత శాఖల అధికారులు ఈ దిశగా తలమునకలవుతున్నారు.

యంఆర్‌ఆర్ కింద రూ. 18.54 కోట్లు

మెయింటనెన్స్ ఆఫ్ రూరల్స్ రోడ్స్ పథకం కింద 15 రోడ్ల పనులను చేపట్టేందుకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 15 రోడ్ల పనుల కోసం రూ. 18.54 కోట్ల నిధులను సైతం మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రస్తుతం ఉన్న బీటీ రోడ్లను రెన్యూవల్ చేస్తూ ఆధునీకరించనున్నారు. దీంతో పాటు ఈ పనులకు సంబంధించిన ప్రక్రియ టెండర్ దశలో ఉంది.

చెల్లింపులన్నీ ఎన్‌ఐసీ ద్వారా..

గతంలో వివిధ రకాల అభివృద్ధి పనులకు సంబంధించి చెల్లింపులన్నీ సాఫ్ట్‌వేర్ సిస్టం ద్వారా కొనసాగేవి. అయితే ఈ చెల్లింపుల వ్యవహారాల్లో పెద్దఎత్తున అవకతకలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ చెల్లింపులపై విచారణ జరిపిన ప్రభుత్వం దీని కోసం ప్రత్యామ్నాయాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించింది. దీంతో సంబంధిత అధికారులు ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ ద్వారా చెల్లింపులను నిలిపివేసి ఎన్‌ఐసీ (నేషనల్ ఇన్ఫర్‌మేషన్ సెంటర్)కు సాఫ్ట్‌వేర్‌ను బదలాయించింది. దీంతో చెల్లింపులన్ని ఇక పారదర్శకంగా జరగనున్నాయి. గత సాఫ్ట్‌వేర్‌ను పక్కకు తప్పించి ఎన్‌ఐసీ ద్వారా రూపొందించిన కొత్త సాఫ్ట్‌వేర్ ఆధారంగా పనుల పురోగతికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని అప్‌లోడ్ చేసిన తరువాతనే పనులు చేసిన కాంట్రాక్టర్‌లకు బిల్లులు మంజూరుకానున్నాయి.

నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం



పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకరయ్యను సంప్రదించగా... వివిధ పథకాల కింద రోడ్ల నిర్మాణం పనులు చేపట్టేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరు రాగానే అభివృద్ధి పనులను త్వరితగతంగా చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

- శంకరయ్య, ఈఈ, నిర్మల్ జిల్లా

తురాటి గ్రామం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- లారీ డ్రైవర్ మృతి • 29 మందికి గాయాలు



లారీలో నుండి డ్రైవర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తురాటి గ్రామం వద్ద శనివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నిర్మల్ వైపు నుంచి వెళ్తున్న లారీ లోకేశ్వరం మండలం రాజూర గ్రామం నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న బస్సును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. రాజూర నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెనుక సీట్లో కూర్చున్న బాగాపూర్ గ్రామానికి చెందిన రాజు ఒక్కసారి ముందర సీట్‌లో పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. బస్సులో 29 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. లారీడ్రైవర్ కృష్ణా జిల్లాకు చెందిన గజ్జ శ్రీను రెండ కాళ్లు ఇరుక్కుపోయాయి. గంటసేపు ప్రాణాలతో పోరాడుతున్న డ్రైవర్‌ను. స్థానికులు, పోలీసులు జేసీబీ సహాయంతో బయటకు తీసి 108లో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. డ్రైవర్‌కు తీవ్ర రక్తస్రావం కావడంతో నిర్మల్‌లో చికిత్స పొందుతూ మరణించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఎడమ కాలు విరిగిపోవడంతో స్థానికులు అతడిని బస్సులో నుండి బయటకు తీసి 108లో ఆసుపత్రికి తరలించారు. భోజవ్వ, గంగవ్వ, లక్ష్మీ అనే మహిళలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఒక కేసులో భైంసా నుండి నిర్మల్ వైపు వెళ్తున్న అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, గ్రామీణ సీఐ కృష్ణ, నర్సాపూర్(జి) ఎస్సై సాయికిరణ్ ప్రమాదంలో గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు. గంటసేపు ట్రాఫిక్ జామ్ కావడంతో భైంసా నుండి క్రేన్లు తెప్పించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.



బస్సు డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

నిద్రిస్తున్న మహిళపై బండరాయితో దాడి

- పాత గొడవలతో ఇలా చేశారని బాధితురాలి ఫిర్యాదు

సోన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంజాల్ గ్రామంలోని వడ్డెర కాలనీలో నివసిస్తున్న సంపంగి నాగమణి(60)పై ఇద్దరు వ్యక్తులు బండరాయితో దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే రాత్రి సమయంలో బయట నిద్రిస్తున్న సంపంగి నాగమణి(60)పై రాత్రి 2 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్, సాయిలు అనే ఇద్దరు వ్యక్తులు బండరాయి పడేసి పారిపోయాడు. శ్రీకాంత్, సాయిలను గుర్తుపట్టానని, వారు పాత గొడవలు మనసులో పెట్టుకు ఇలా చేశారని ఫిర్యాదు ఇవ్వగా సోన్ ఎస్సై కే. గోపి కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం నాగమణి నిర్మల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



గోవింద్ మృతదేహం.. ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బాసరఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి):బాసర రైల్వేస్టేషన్ సమీపంలో పురుగుల మందు తాగి ధర్మాబాద్ మండలం భాజెగావ్ గ్రామానికి చెందిన గోవింద్ (38) ఆత్మహత్య చేసుకున్నట్లు బాసర పోలీస్‌లు తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర చెందిన గోవింద్ కుటుంబం కొన్నేళ్ల క్రిందట భైంసాలో స్థిర పడింది. పెళ్లి జరిగి 15 ఏళ్లు అవుతున్న సంతానం లేకపోవడంతో మనస్తాపానికి గురై గోవింద్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.సంఘటన స్థలంలో పురుగుల మందు డబ్బా, మందు తాగిన ఆనవాళ్లు దొరికినట్లు వివరించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎస్సై రహమాన్ మాలిక్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్సై రహమాన్ మాలిక్‌ను పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. ఆయనను కలిసిన వారిలో నాయకులు అల్లోల సురేందర్ రెడ్డి, ఎర్ర రఘునందన్ రెడ్డి, ఓస రాజేశ్వర్, సత్య నారాయణ, కొమ్మెజి రమణ, కల్లెడ భూమన్న, మోహన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం అందజేత



ఓలాలో బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్ర బృందం

కుంటాల, ఏప్రిల్, 12 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓలా గ్రామానికి చెందిన పలువురు వడ్రంగుల షెడ్లు అగ్ని ప్రమాదంలో కాలి బూడిదవ్వగా సమాచారం తెలుసుకున్న నిర్మల్ మిత్ర బృందం బాధితుల కొరకు 75,000 రూపాయలు విరాళంగా సేకరించి వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాలం శ్రీనివాస్, ఎండపెల్లి అశోక్ కుమార్, గాజుల దేవిదాస్, రామేశ్వర్, షేక్ హుస్సేన్, లతీఫ్, బిల్లోల శ్రీనివాస్‌గౌడ్, కట్ట రవి, పూస శంకర్, మేథరి నర్సయ్య, వినోద్, యువ చైతన్య యూత్ సభ్యులు వేముల సాయి కుమార్, అమృత్, గజేందర్, విజయ్, హరీష్, అక్షయ్‌లు పాల్గొన్నారు. చేతివృత్తిని నమ్ముకొని పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో చెరోకొంత జమ చేసి ఆర్థిక సాయంగా డబ్బులు అందించిన వారిని పలువురు అభినందించారు.

ఖానాపూర్‌లో మరోసారి దొంగల కలకలం

ఖానాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం పట్టణంలోని వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయం, మండలంలోని తర్లపాడ్ గ్రామంలో గల అగ్గిమల్లన్న స్వామి ఆలయంలో జరిగిన దొంగతనాల ఘటనలు మరువకముందే ఖానాపూర్‌లో దొంగలు మరోసారి తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. పట్టణ శివారు ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాల నుంచి గురువారం, శుక్రవారం రెండు వరుస రోజులలో రాత్రివ ఏళ 2 వ్యవసాయ విద్యుత్ మోటార్లను దొంగలు అపహరించుకుపోయారు. కొమరం భీమ్ చౌరస్తా సమీపంలో గల ఓ మామిడి తోటలో బుధవారం ప్రొద్దున సమయంలో విద్యుత్ మోటార్‌తో మామిడి చెట్లకు నీళ్లు అందజేసిన రైతుప పడిగెల శ్రీధర్ శుక్రవారం తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లగా విద్యుత్‌మోటార్ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఖానాపూర్ శాంతి నగర్‌కు చెందిన మరో రైతు గాండ్ల రాజేందర్ శుక్రవారం సాయంత్రం తన వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్ మోటార్‌ని ఉపయోగించి ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం తన వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్ మోటార్‌తో నీరు పెట్టేందుకు వచ్చిన రైతు రాజేందర్‌కు అక్కడ విద్యుత్ మోటార్ కనిపించలేదు. తొలత స్టార్టర్ బాక్స్ తెరిచి చూడగా అందులో స్టార్టర్ కనిపించలేదు. దీంతో స్టార్టర్‌ను ఎవరో దొంగలు అపహరించుకుపోయినట్లు గ్రహించిన రాజేందర్ విద్యుత్ మోటార్ వద్దకు వెళ్లి పరిశీలించగా అక్కడ మోటార్ కూడా దొంగలించబడినట్లు గుర్తించాడు. దీంతో ఆందోళన చెందిన రాజేందర్ శనివారం ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ రెండు ఘటనల్లో 5 హెచ్‌పీ విద్యుత్ మోటార్లు, స్టార్టర్ సహా వైర్లు దొంగిలించబడినట్లు రైతులు పడిగెల శ్రీధర్, గాండ్ల రాజేందర్‌లు తెలిపారు. దొంగిలించబడిన విద్యుత్ మోటార్లు, ఇతర సామాగ్రి విలువ 60 వేల వరకు ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఘటనకు కారకులైన దొంగలను పట్టుకుని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. కాగా ఇటీవల కాలంలో ఖానాపూర్ మండలంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటు ఆలయాలు, అటు వ్యవసాయ క్షేత్రాలు, మరోపక్క ద్విచక్ర వాహనాలు ఇలా దొంగతనానికి కావేవి అనర్హం అన్నట్లుగా దొంగలు రెచ్చిపోతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ వరుస దొంగతనాలకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రైతు వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్‌మోటార్‌ను దొంగలించే సమయంలో దొంగలు కట్ చేసిన పైపులు

మరింత గస్తీని పెంచుతాం

- రాహుల్ గైక్వాడ్, ఎస్సై ఖానాపూర్

ఖానాపూర్ మండలంలో ఇటీవల జరిగిన దొంగతనాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో మరింత గస్తీని పెంచుతాం. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నాం. దొంగతనాలకు పాల్పడుతూ ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న దుండగులను ఉపేక్షించేది లేదు. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. గుర్తు తెలియని వారు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. దొంగలపై ఖచ్చితంగా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. జరిగిన దొంగతనాలపై అన్ని కోణాల్లో లోతైన విచారణ సాగుతోంది. ఖచ్చితగా దొంగలను పట్టుకుంటాం.

రాజ్యాంగ ఫలాలు పొందడం ప్రతి పౌరుని హక్కు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీనివాస్‌రావు



జాంలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సారంగాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ ఫలాలు పొందడం ప్రతి పౌరుడి హక్కు అని కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కులాచారి శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం మండలంలోని జాం మహావీర్ తండాలో జై భీమ్, జై బాపు, జై సంవిదాన్ రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా పాదయాత్రను నిర్వహించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ పార్టీ దేశ సమగ్రతను కాపాడడంలో రాజకీయాలు చేస్తుందన్నారు. భారత్‌జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ దేశ ఐక్యతను చాటి చెప్పారని అన్నారు. పార్లమెంట్‌లో బీజేపీ నాయకులు రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌కు అవమాన పరచడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ్ రాజజేశ్వర్, పార్టీ మండల అధ్యక్షులు నర్సయ్య, నాయకులు ఓల్గతి నారాయణ్‌రెడ్డి, కోర్వ నవీన్‌రెడ్డి ముత్యంరెడ్డి, శంకర్ రెడ్డి, పోతారెడ్డి, ఆహ్మద్ ముక్తార్, లక్ష్మణ్, రాజు, నాయకులు, కార్యకర్తలున్నారు.

హనుమాన్ ఆలయంలో డీసీసీ అధ్యక్షుడి పూజలు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం ఆదర్శనగర్ హనుమాన్ ఆలయంలో శనివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు కామారపు జగదీశ్వర్ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు.

మన్మథ్ గ్రామంలో మల్లన్న కల్యాణ మహోత్సవం



మల్లన్నను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

లోకేశ్వరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్మథ్ గ్రామంలో శనివారం మల్లన్న కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను స్వాగతించి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆలయానికి రహదారి కోసం సీసీ రోడ్ల నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేస్తానన్నారు. ఆలయ భూముల రక్షణకు కంచె ఏర్పాటు కోసం 10 లక్షల రూపాయల నిధులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, భైంసా మండల మాజీ జడ్పీటీసీ పండిత్ రావు పటేల్, లోకేశ్వరం బీజేపీ మండల అధ్యక్షులు సాయన్న, రాజూర ఎంపీటీసీ పోతన్న, దాసరి ప్రవీణ్, పృథ్వీ లింగన్న, రాజారాం, నారాయణ, శంకర్ గౌడ్, మహిళా మోర్చా నాయకురాలు సరస్వతి, సంఘ సభ్యులు, నాయకులు, తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ జయంతి ఉత్సవాలు జయప్రదం చేయండి : బీజేపీ



నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ జయంతి వారోత్సవాలు జయప్రదం చేయా లని ఉత్సవాల కన్వీనర్ సాప్లీ రమేష్ కోరారు. బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుండి 25 వరకు వీటిని నిర్వహిస్తున్నట్లు శనివారం నిర్వహించిన సమావేశంలో తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో ద్విచక్ర వాహన ప్రదర్శన నిర్వహించాలని, అంబేద్కర్ విగ్రహాల శుద్ధి చేపట్టాలన్నారు. 14న జయంతి నిర్వహించాలని రాజ్యాంగ పీఠిక సామూహికంగా పఠించాలన్నారు. సెమినార్లు చేపట్టాలన్నారు. దళితమోర్చా అధ్యక్షుడు రాచ కొండసాగర్, పార్లమెంట్ కన్వీనర్ భూమయ్య, మెడిసెమ్మెరాజు, ఆడెపు సుధాకర్, డి. పోశెట్టి, సుంకరి సాయి, ఆకుల కార్తీక్, కే. శ్రావణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : విశ్వనాథ్ పేట్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఉదయం 6 నుండి 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ మార్కెట్, మోచిగల్లి, బుధవార్ పేట్, గాంధీచౌక్, బంగల్‌పేట్, కబూతర్ కమాన్, నాయుడివాడ, వైఎస్‌ఆర్ కాలనీ, విశ్వనాథ్‌పేట్, డాక్టర్ లైన్, గాజుల పేట్ వాసులు సహకరించాలని కోరారు.

దివ్యనగర్ ఫీడర్ మరమ్మతులు

టౌన్ 3 దివ్యనగర్ ఫీడర్ మరమ్మతులు చేస్తున్నందున ఆదివారం ఉదయం 8 నుండి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎన్ రెడ్డి కాలనీ, శాస్త్రినగర్, దివ్య నగర్, అయ్యప్ప ఆలయ ప్రాంతాల్లో ఈ అంతరాయం ఉంటుందన్నారు.

నటరాజ్‌నగర్ ఫీడర్‌కు మరమ్మతులు

నటరాజ్ నగర్ 11 కేవీ ఫీడర్ మరమ్మతులు ఆదివారం నిర్వహిస్తున్నామని డీఈ పేర్కొన్నారు. దీంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, చైన్‌గేట్, ఇందిరానగర్, గొల్లపేట, మంచిర్యాల చౌరస్తా, బోయవాడ, మదీనా కాలనీ, తదితర ప్రాంతాల్లోని ప్రజలు సహకరించాలన్నారు.

మామడ 33/11 సబ్‌స్టేషన్‌ల పరిధిలో..

మామడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : 33/ 11 కేవీ, సబ్‌స్టేషన్‌ల పరిధిలో వచ్చే గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని విద్యుత్ ఏఈ బాలయ్య తెలిపారు. పొన్కల్, పరిమండల్, తాంద్ర, మామడ, రాయదారి, ఆరేపల్లి, ఇతర గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందన్నారు. నెల వారి మరమ్మతుల కారణంగా 33/11 మామడ ఫీడర్ పైన చెట్ల కొమ్మలను తొలగించుటకు, విద్యుత్ లైన్‌లలో ఉన్న మరమ్మతులను సరిచేయబడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

15 నుంచి గాలికుంటు వ్యాధి టీకాలు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాల కార్యక్రమం చేపట్టినట్లు పశువైద్యాధికారి ఎండి బలీగ్ అహ్మద్ తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో జాతీయ పశువ్యాధి నియంత్రణలో భాగంగా నిర్వహించే కార్యక్రమాన్ని పాడి రైతులు, పాల సేకరణ అధ్యక్షులు ఉపయోగించుకోవాలని కోరారు. మూడు నెలల పైబడిన దూడలకు సైతం టీకా వేయించాలన్నారు. ఆఫ్తోస్ వైరస్‌తో గాలికుంటు వ్యాధి సోకుతుందన్నారు.

సత్తాచాటిన శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వెలువడిన జాతీయస్థాయి స్పేస్ షటిల్ 2025 ఫలితాల్లో స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. విద్యార్థులను చైర్మన్ ఎం. శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ప్రధానోపాధ్యాయులు జగతిరెడ్డి అభినందించారు.

వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలి : సీపీఐ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తూ నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ... మైనారిటీల హక్కులను హరించేందుకు ఈ చట్టం రూపొందించారని ఆరోపించారు. నాయకులు ఎస్‌ఎన్ రెడ్డి, భూక్యా రమేష్, ప్రకాష్, జాదవ్ వంకర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

'హనుమాన్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా'

బోథ్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని మాజీ ఎంపీ స్వయం బాబురావు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మాజీఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్లు పేర్కొన్నారు. శనివారం మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వచ్చి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృషి చేస్తుందని అయితే అందులో భాగంగానే పాట్నాపూర్ గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయానికి ప్రహరీ కూడా నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఇప్పటికే వివిధ ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగిందని భవిష్యత్తులో మరికొన్ని ఆలయాలకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బి.గంగారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాజీ ఎంపీటీసీలు షేక్ నాజర్, సహకార సంఘం డైరెక్టర్ చెట్ల ఉమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రహీమ్, మసీద్, అనిల్ అప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ఉట్నూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్కెట్టిపేట గ్రామానికి చెందిన మెస్రం అనిత తల్లితండ్రులు కొన్ని సం వత్సరాల క్రితం మృతిచెందారు. దీంతో ఆ యువతి అనాధగా మారింది. గ్రామపెద్దలు ఈనెల 14న మెస్రం అనిత పెళ్లి ఆర్క మహేష్‌తో నిశ్చయించారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆ యువతి వివాహానికి రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల కుటుంబాలకు వెడ్మఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ప్రజాసేవ కోసం వెడ్మ ఫౌండేషన్ నిర్మాణం అయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్కెటిపేట గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే

భక్తిశ్రద్ధలతో హనుమాన్ ర్యాలీ


భీంపూర్‌లో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న నాయకులు


పూజలు చేస్తున్న గ్రామస్తులు

మావల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ ర్యాలీలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున నుంచే భక్తులు హనుమాన్ ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. జైశ్రీరామ్.. జై హనుమాన్ అంటూ నామస్మరణ చేశారు. అన్న దానం నిర్వహించారు.

ఆదిలాబాద్ రూరల్ : గ్రామంలోని భారీ హనుమాన్ విగ్రహానికి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎర్ర నర్సింగ రావు, భూమన్న, ప్రభాకర్, రమణ, కాంతు, కిషన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

తాంసి : మండల కేంద్రంతోపాటు పొన్నారి, బోడ గుట్ట, సావర్గావ్, బండల్నాగాపూర్ గ్రామాలలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసాను పటించారు. అనంతరం ఆయా హనుమాన్ మందిరాల ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బోడగుట్ట సమీపంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని గుట్ట హనుమాన్లు కుటుంబసభ్యులు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ జడ్పీటీసీలు తాటిపల్లి రాజు, గోకగణేశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు పూజలు చేశారు.

నేరడిగొండ : మండల కేంద్రంలో గల హనుమాన్ ఆలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నాయకులతో కలిసి దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం నేరడిగొండ మండలంలోని చించొలిలో గల పంచముఖి హనుమాన్ ఆలయాన్ని, తేజపూర్ గ్రామంలో గల హనుమాన్ ఆలయంలో బోథ్‌ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరి వెంట మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, ప్రీతం రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, గులాబ్, పండరీ, సాబ్లే సంతోష్, రాథోడ్ సురేందర్, కరణ్, విజయ్ పాల్గొన్నారు.

భీంపూర్ : మండలంలోని పిప్పల్ కోటి, నిపాని, తాంసి (కే), భీంపూర్, దన్నోర, వాడుర్, అర్లి (టీ), అంతర్గం, గోముత్రి, కరంజి టీ, గుబ్‌డి, బెల్సర్ రాంపూర్, అందర్ బంద్ తదితర గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద మహా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బోథ్ : మండలంలో అన్ని గ్రామాలలో భక్తులు ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా బోథ్ మండల కేంద్రంలో నిర్వహించిన శాసనసభ్యులు అనిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ వేడుకలను ఐకమత్యంతో యువకులు జరుపుకోవడం అభినందనీయమన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆయన కోరారు. మండలంలోని కనుగుట్ట గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో హను మాన్ విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం గ్రామస్తులు కన్నుల పండుగగా నిర్వహించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ మాజీ సర్పంచ్ మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి గ్రామస్తులతో కలిసి హోమగుండం వద్ద అర్చకుల సమక్షంలో పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గుడిహత్నూర్ : హనుమాన్ ఆలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

నార్నూర్ : ఉదయం నుంచి అన్ని హనుమాన్ మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయంతి సందర్భంగా హనుమాన్ మందిరం వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గజానంద్ నాయక్ హాజరయ్యారు. హనుమాన్ జన్మోత్సవం పురస్కరించుకొని తెల్లవారుజామున స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట నాయకులు ఉత్తం రాథోడ్, బ్రిజల్ పాల్గొన్నారు. మండల కేంద్రంలోని రాజరాజేశ్వర ఆలయంలో గత వారం రోజులుగా 11 మంది ప్రతిరోజు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. చివరి రోజు హనుమాన్ జయంతి సందర్భంగా పారాయణం ముగింపు నిర్వహించారు. ఈ పారాయణం కార్యక్రమంలో ఏలేటి సుధాకర్‌రెడ్డి, ఏలేటి చక్రధర్‌రెడ్డి, కొక్కుల గంగాధర్, మధుమతిరెడ్డి పాల్గొన్నారు.

ఇచ్చోడ : హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం ఇచ్చోడ మండల కేంద్రంలోని హనుమాన్‌సాయి ఆలయం నుంచి ప్రారంభమైన వీరహనుమాన్ భారీ శోభయాత్రను హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హనుమాన్ సాయి ఆలయం నంచి ప్రారంభమైన శోభయాత్ర ఇచ్చోడ పట్టణంలో ప్రధాన వీధుల గండా డీజేచప్పుళ్ల నడుమ ఊరేగించారు. ఇచ్చోడ సీఐ భీమేష్, ఎస్సై తిరుపతిలు పోలీసులు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటుచేశారు.

మావల : జిల్లా కేంద్రంలో హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర వైభవంగా సాగింది. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన హనుమాన్ శోభాయాత్రలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు పాల్గొన్నారు. ఈ మేరకు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎస్పీ అఖిల్ మహాజన్, మఠాధిపతి యోగానంద సరస్వతి, తదితరులు హనుమాన్ విగ్రహం వద్ద పూజలు జరిపిన అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. ముందుగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భారీసంఖ్యలో తరలివచ్చిన యువకులు నృత్యా లు చేస్తూ సందడి చేశారు. కాగా, శోభాయాత్ర సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఎస్పీ పర్యవేక్షణలో సిసి కెమెరా డ్రోనలతో గట్టి నిఘా మధ్య పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దారి పొడవునా యాత్రకు ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నారు. బందోబస్తు ప్రక్రియను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ శోభయాత్రలో హనుమాన్ భక్తులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

తలమడుగు : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మం డలంలోని అతి పురాతనమైన కోసాయి సంకట యోజన వీర హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతిని సందర్భంగా భక్తులతో ఆలయం కిటకిటలాడింది. సందర్భంగా ప్రజాప్రతినిధులతో పాటు భక్తులు అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జయంతి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కబడ్డీ పోటీ ల్లో తెలంగాణ మహారాష్ట్ర నుంచి దాదాపు 50 చెట్లు కబడ్డీ పోటీలో పాల్గొన్నాయి. అదేవిధంగా హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించేందుకు మహారాష్ట్ర నుంచి ట్రైన్ ద్వారా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ఎంపీ నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ జెడ్పిటిసి గణేష్ రెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.


బోథ్‌లో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే

రత్నాపూర్ గ్రామాన్ని సందర్శించిన సత్యసాయి సేవా ట్రస్ట్‌సభ్యులు


గిరిజనులతో మాట్లాడుతున్న ట్రస్ట్ జిల్లా సభ్యులు

ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా తలమడుగు మండలంలోని రత్నాపూర్ ఆదివాసి గిరిజనులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో పలువురు స్పందించారు. శుక్రవారం జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు, శనివారం సత్యసాయి సేవా ట్రస్టు సభ్యులు ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు కార్యవర్గసభ్యులు ఉదయం 6 గంటలకే రత్నపూర్ ఆదివాసి గిరిజన గ్రామాన్ని సందర్శించి వారితో గ్రామసభ ఏర్పాటు చేసి వారు ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వారి జీవనస్థితిగతులు కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు ఊరంతా కలిసి తెచ్చుకునే వ్యవసాయ పొలంలోని బావి వద్దకు వెళ్లి బావిని పరిశీలించారు. గ్రామంలో భూగర్భ జలాల విషయాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామానికి సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీటిపై ఆరా తీశారు. వారు ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలపై కమిటీ సభ్యులతో చర్చించి వారికి ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షులు నరసింహారావు, కన్వీనర్ విలాస్, సంధి, కార్యవర్గ జిల్లా సభ్యులు పాల్గొన్నారు.



బావిని పరిశీలిస్తున్న ట్రస్ట్ సభ్యులు

నిర్మల్ జిల్లాలో కన్నుల పండువగా హనుమాన్ జయంతి

● కిక్కిరిసి పోయిన దేవాలయాలు ● భక్తి శ్రద్ధలతో శోభాయాత్రలు ● వెల్లువెత్తిన జై హనుమాన్ నినాదాలు


భైంసాలోని దక్షిణముఖి వీర్ హనుమాన్ ఆంజనేయ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఖానాపూర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్


తానూర్‌లో శోభాయాత్ర

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లో వైఎస్ఆర్ నగర్ ఆదివాసి కాలనీలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర బీజేపీ నాయకులు రావుల రాంనాథ్ జ్యోతి వెలిగించి ఉత్సవాన్ని ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి మూర్తి, డాక్టర్ యూ. కృష్ణంరాజు, పొన్నం నారాయణ గౌడ్, తోట సత్యనారాయణ, డాక్టర్ అవినాష్, వేణుగోపాల కృష్ణ కాలనీ అధ్యక్షుడు దేవేందర్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా అలంకరణలు

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాలు విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు, హనుమాన్ మాల స్వాములు శనివారం తెల్లవారు జాము నుంచే హనుమాన్ ఆలయాలకు చేరుకొని స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. గ్రామాల్లో హనుమాన్ శోభాయాత్రలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శనివారం హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామంలోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆయా హనుమాన్ ఆలయాల వద్ద ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఖానాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ సహా పలువురు ప్రముఖులు మండలంలోని పలు హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేకపూజలను నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆంజనేయస్వామి ఆలయాలకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు కలుగకుండా ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రసాద వితరణ

లక్ష్మణచాంద, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునిపెల్లి, మాచాపూర్, మల్లాపూర్, పార్‌పెల్లి, ధర్మారం, పీచర, రాచాపూర్, వడ్యాల్, కనకాపూర్, బోరిగాం, కంజర్, నర్సాపూర్(డబ్ల్యూ), బాబాపూర్, పొట్టపెల్లి(కె), లక్ష్మణచాంద, చామన్‌పెల్లి, తిరుపెల్లి, చింతల్‌చందా తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాల్లోని హనుమాన్ విగ్రహాలకు అభిషేకం చేసి చంధూరం (కాషాయ రంగు) పూసి, పూల మాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం (ప్రసాద వితరణ) చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అధికసంఖ్యలో ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు

భైంసా, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు కన్నుల పండుగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఇక్కడి ప్రాంతంలోని అన్ని హన్‌మాన్ మందిరాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలలో పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేకువ జాము నుండి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.హన్మాన్ మందిరాల్లో భజన కార్యక్రమాలు కొనసాగాయి. ఆయా ప్రాంతాల్లోని ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు వేడుకలకు హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆలయాలను, హనుమాన్ విగ్రహాలను శోభా యమానంగా అలంకరించారు. ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు స్వయంగా ఆహార పదార్థాలు వడ్డించారు.

ముథోల్ మండలంలో..

ముథోల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని తరోడా, చించాల, వెంకటాపూర్, ఆష్ట, చింతకుంట, ఎడ్‌బిడ్, రాంటెక్ తదితర గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయాల వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మార్మోగిన ఆంజనేయ నామం

తానూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఆంజనేయ నామం మారుమోగ్రింది. హనుమాన్ జన్మోత్సవాన్ని పురష్కరించుకొని హనుమాన్ ఆలయాలకు భక్తులకు తాకిడి పెరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తానూర్‌లో ప్రధాన వీధుల గుండా హనుమాన్ శోభయాత్ర నిర్వహించారు. భక్తి గేయాలతో, అంజన్న పాటలతో శోభాయాత్ర కొనసాగింది.

హనుమాన్ విగ్రహంతో శోభాయాత్ర

కుభీర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం హనుమాన్ జన్మోత్సవ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కుభీర్‌లో హనుమాన్ విగ్రహంతో శోభయాత్ర నిర్వహించారు. అదే విధంగా మండలంలోని పార్డి(కే) గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. గ్రామంలో ప్రధాన రహదారుల గుండా శోభయాత్ర కొనసాగింది. ఆయా గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


కుంటాల, ఏప్రిల్, 12 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నుండే హనుమాన్ ఆలయాల్లో ఆంజనేయునికి అభిషేకం, అర్చన, తదితర ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. గత 40 రోజుల నుంచి హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి నెత్తిన పెట్టుకొని కొండగట్టుకు బయలుదేరి వెళ్లారు. మండల కేంద్రం కుంటాలలో పలువురు అంజన్న స్వాములు పొర్లు దండాలు చేపట్టారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మాజీ కమిషనర్‌ను పరామర్శించిన జిల్లా నేతలు


మాజీ కమిషనర్‌ను పరామర్శిస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఉద్యానవనశాఖ రాష్ట్ర మాజీ కమిషనర్ లోక వెంకట్రామ్‌రెడ్డిని శనివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు జిల్లాకు చెందిన పలువురు నేతలు పరామర్శించారు. వెంకట్రామ్‌రెడ్డి గత కొన్ని రోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతుండగా ఇటీవలే వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను జిల్లా నాయకులు పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ... జిల్లాకు చెందిన వెంకట్రామ్‌రెడ్డి రాష్ట్ర ఉద్యానవన శాఖ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో జిల్లా రైతులకు విశేష సేవలు అందించారన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలం పాటు అధిక లాభాలను ఇచ్చే ఆయిల్ ఫామ్ తోటల సాగుపై అవగాహన కల్పించి జిల్లా రైతులను ఎంతగానో ప్రోత్సహించారన్నారు. పదవి విరమణ చేసిన తర్వాత కూడా ఇప్పటికీ రైతులకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తూ అవసరమైన సూచనలు, సలహాలు అందజేయడం గొప్ప విషయమన్నారు. త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకొని రైతులకు తన సేవలను కొన సాగించాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కాగా పరామర్శించిన వారిలో ఇంద్రకరణ్ రెడ్డితో పాటు డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, సారంగాపూర్ మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నిర్మల్ క్లబ్ కార్యదర్శిగా ఎర్రవోతు రాజేందర్ ఎన్నిక



నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ క్లబ్ కార్యదర్శిగా ఎర్రవోతు రాజేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల ఫలితాలను పరిశీల కులు ఆర్.శంకర్‌రావు, డి.పోశెట్టిలు ప్రకటించారు. కాగా క్లబ్ ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా గాజర్ల లక్ష్మణ్‌గౌడ్, కోశాధికారిగా పుప్పాల రమేష్, క్రీడా కార్యదర్శిగా అనుముల రాజేందర్, కార్యవర్గ సభ్యులుగా ఎంబడి నరేష్, సత్యపాల్ రెడ్డి, కే. శంకర్, అర్కారి రామన్న, అనుముల రాజేంద్రనాథ్, జల్దా రమణలు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం కొత్త కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్నికల పరిశీలకులు తెలిపారు.

మండలాలకు చేరుతున్న ఏకరూప దుస్తులు



నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులకు అందించేందుకు ఏకరూప దుస్తులు ఆయా మండల కేంద్రాలకు చేరుతున్నాయి. శనివారం నిర్మల్ అర్బన్ మండలానికి చెందిన ఏకరూప దుస్తులను సమన్వయకర్త ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఆయా మండల విద్యాధికారులు ఏకరూప దుస్తులను ఎమ్మార్సీలో భద్రపరిచి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ద్వారా కొలతల ప్రకారం కుట్టించాలన్నారు. జిల్లాలో 48,874 విద్యార్థులకు రెండు జతల దుస్తులు రానున్నట్లు తెలిపారు.

భవన నిర్మాణ కార్మిక సభలు

విజయవంతం చేయండి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికుల మహాసభ లను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు ప్రకాష్, ఎస్. విలాస్ పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడు తూ... ఈ నెల 14న టీఎన్జీవో భవన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మికులకు 5 వేల పెన్షన్, 10 లక్షల ప్రమాద బీమా తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. నసీర్, ఎస్ఎన్ రెడ్డి, భూక్యా రమేష్, జమాల్, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం 2005పై ప్రతి పౌరుడికి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. శనివారం నిర్మల్‌లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు హైదర్ పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళలు ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు సిహెచ్. వినోద్ కుమార్, అబ్దుల్ సాదిక్, హర్షద్, జహీర్ అహ్మద్, బి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న సభ్యులు

వీవో కార్యవర్గం ఎన్నిక

కుభీర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్డి(బి) గ్రామ వివో లీడర్లను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గ్యారపు లక్ష్మీ, ఉపాధ్యక్షురాలుగా కాంతాబాయి, కార్యదర్శిగా జ్యోతిబాయి, సహాయ కార్యదర్శిగా చిట్యాల రాణి కోశాధికారిగా గుమ్ముల లావణ్యలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సభ్యులు, సీసీ దత్తాత్రి, వివోఏ సాయినాథ్, తదితరులున్నారు.



సారంగాపూర్ గ్రామ పంచాయతీ భవనం

ఇదేం పంచాయతీ?

● అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న గ్రామాల ప్రజలు
● పట్టించుకోని అధికారులు

సారంగాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలై ఏడాది ముగుస్తోంది. ఒక్కొక్క పంచాయతీకి ఒక్కో అధికారిని నియమించాల్సి ఉండగా కొరతతో రెండు మూడు గ్రామాల్లో ప్రత్యేక అధికారి నియమించారు. దీంతో పని భారం పెరిగి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లోపించింది. పంచాయతీలతో పాటు మండల పరిషత్‌లకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులకు నియమించిన వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. సొంత శాఖల్లో పని భారంతో పల్లెల వైపునకు కన్నెత్తి చూడక పోవడంతో క్షేత్రాయిలో గ్రామ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సమావేశాలకు సంతకాలకే పరిమితం అవుతుండడంతో పాలన పడకేసింది. నిధులేమి పర్యావేక్షణ లోపం పాలన వ్యవహరాలు చూసేవారు లేక ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.

● భారం అంతా కార్యదర్శులపైనే..

మండలంలో 32 గ్రామపంచాయతీలు ఉండగా నిధుల లేమితో పంచాయతీల నిర్వాహణ భారం కార్యదర్శులపై పడుతుంది. పారిశుధ్య నిర్వాహణ తాగు నీటి పథకాల మరమ్మత్తుల వైపు లైన్లో లీకేజీ వీధి దీపాలు ఇలా పలు రకాల పనుల కోసం సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తుందని పలువురు పంచాయతీల కార్యదర్శులు వాపోతున్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సరిపడా విడుదల కాకపోవడంతో కష్టంగా మారింది. నిధుల కొరతతో పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించక వారితో పని చేయడం కష్టంగా మారింది.

● వేసవిలో గట్టెక్కేనా..!?

పల్లెల్లో ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదు. భగీరథ నీరు పల్లెలకు చేరక పోవడంతో స్థానిక వనరులపై ఆధారపడుతున్నారు. తాగు నీటి పథకాల్లో నీటి వనరులు లేని గ్రామాల్లో మంచి నీటినిక కటకట తప్పడం లేదు. ట్యాంకర్లతో బోరు బావుల నుండే కాకుండా ఇతర ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్న పంచాయతీల్లో నిధులు ఉంటేనే సాధ్యపడుతుంది. ప్రత్యేక అధికారుల పాలనలో వేసవి ఎలా గట్టెక్కుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక అధికారులు గ్రామాలను పట్టించుకొని తగిన చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

● పల్లెల్లో సమస్యలివీ..!?

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక చిన్న పంచాయతీల్లో గతంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్ రుణ వాయిదాలు చెల్లించడం కష్టంగా మారింది.
● పల్లె ప్రకృతి వనాలు క్రీడా ప్రాంగాణాల నిర్వాహన కొరవడింది.
● గతంలో పల్లెలకు పంపిణీ చేసిన చెత్త డబ్బాలు విరిగి పోవడంతో కొత్తవి కొలేక పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది.
● కొన్ని పంచాయతీల్లో డీజిల్‌కు డబ్బులు చెల్లించ లేక చెత్త ట్రాక్టర్లు తిరగక పోవడంతో రహదారులపై అక్కడక్కడ చెత్త దర్శనమిస్తుంది.
● కొన్ని గ్రామాల్లో డాక్టర్లకు డీజీల్ కోసం పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేస్తున్నారు.
● కొన్ని గ్రామాలకు భగీరథ నీరు చేరక పాత తాగునీటి పథకాల నిర్వాహన విద్యుత్ బిల్లుల చెల్లింపు కష్టతరంగా మారింది.
● క్రీడా ప్రాంగణాల్లో అమర్చిన పరికరాలు తుప్పు పడుతున్న మార్చలేని పరిస్థితి నెలకొంది.

మోకాళ్లపై నిల్చొని అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

బాసర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ వద్ద కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన కొనసాగుతోంది. రెగ్యులరైజ్ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో విధులను బహిష్కరించారు. నాలుగు రోజు శనివారం అసిస్టెంట్ ప్రొఫెసర్లు యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించే వరకు ఆ అందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

'బాలికా సంరక్షణ'కు భరోసా ఏదీ..!?

● మెచ్యూరిటీ నిండినా అందని రూ. లక్ష ● గడువు దాటినా దక్కని ఫలం

ముథోల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బాలికా సంరక్షణ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్త మవుతున్నాయి. ఆడపిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించడానికి సుమారు 20 ఏళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాలికా సంరక్షణ పథకాన్ని ప్రవేశపెట్టింది. శిశు సంక్షేమ శాఖ ద్వారా అనేక మంది నిరుపేద ఆడపిల్లలను అర్హులుగా గుర్తించి వారందరికీ ఎల్ఐసీ బాండ్లను అందించింది. మెచ్యూరిటీ గడువు తీరాక ఒక్క ఆడపిల్ల అయితే రూ.లక్ష, ఇద్దరైతే రూ. 60 వేలు అందిస్తామని ఆర్థిక భరోసాతో కూడిన ఆ బాండ్లను ఆడపిల్లల తల్లిదండ్రులకు స్త్రీ, శిశు సంక్షేమ అధికారులు అందించారు. ఇప్పుడు వారిచ్చిన ఎల్ఐసీ బాండ్స్ మెచ్యూరిటీ కాలం పూర్తయినా ఫలితం లేకుండా పోయింది. అనేక మంది ప్రభుత్వ ఆర్థికసహాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఐసీడీఎస్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి అలసిపోయిన లబ్ధిదారులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.



ముథోల్ ఐసీడీఎస్ కార్యాలయం



గతంలో లబ్ధిదారులకు అందజేసిన పత్రం (ఫైల్)

నిరాశే తప్పా ఫలితం శూన్యం

బాలికా సంరక్షణ పథకంపై ఆశపడిన వారికి నిరాశే మిగిలింది. 2001లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయకుడు మహిళల మెప్పు కోసం బాలికా శిశు సంరక్షణ పథకం అమలు చేసి ఆడపిల్లల పేరరూ. 5 వేలు బ్యాంకుల్లో నగదు జమ చేసి 18 ఏళ్లు నిండిన తర్వాత రూ. 20 వేలు లబ్ధిదారులకు అందేలా పథకం రూపొందించారు. ఇదే స్ఫూర్తితో 2004-05 సంవత్సరంలో అప్పటి ఆంధ్ర ప్రదేశ్ సీఎం వైఎస్. రాజశేఖర్ రెడ్డి బాలికా శిశు సంరక్షణ పథకానికి కొన్ని మార్పులు, చేర్పులతో కొత్త బాలికా సంరక్షణ పథకాన్ని తెరపైకి తెచ్చారు. ఒక్క ఆడపిల్ల అయితే రూ. లక్ష, ఇద్దరైతే రూ. 60 వేలు 18 ఏళ్లు నిండాక లబ్ధిదారులకు ఇచ్చేలా ఎల్ఐసీ (పీ అండ్ జీఎస్)తో టైఅప్ అయ్యారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ఏడాది కి రూ. 1200ల చొప్పున ఉపకార వేతనం ఇవ్వాల్సి ఉంది. 2014 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకానికి లక్షల మందిని ఎంపిక చేసి ఎల్ఐసీ బాండ్లను అప్పటి ప్రభుత్వం అందజేసింది. 2014 తర్వాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక ఈ పథకానికి ఎంపికలు లేవు. దీంతో లబ్ధిదారులకు రావాల్సిన డబ్బులు నేటికి అందడం లేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అయినా పట్టించుకొని న్యాయం చేయాలని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

700 మందికి ఎల్ఐసీ బాండ్లు

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 04 ఐసీడీఎస్ ప్రాజెక్టుల ద్వారా బాలికా సంరక్షణ పథకానికి 2004-05 నుంచి 2013-14 వరకు సుమారు 700ల మందిని ఎంపిక చేసి ఎల్ఐసీ బాండ్లను అందించినట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. జిల్లాలోని నాలుగు ఐసీడీఎస్ ద్వారా మెచ్యూరిటీ పూర్తయిన 250 మంది లబ్ధిదారుల ఎల్ఐసీ బాండ్లను హైదరాబాద్ మాతా స్త్రీ శిశు సంక్షేమ శాఖకు, ఎల్ఐసీకి పంపించారు. గడువు దాటినా నేటికీ ఏ ఒక్కరికి పైసా సహాయం ఇవ్వలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నాం

● సరోజిని, సీడీపీవో, ముథోల్



బాలికా సంరక్షణ పథకం కింద లబ్ధిదారులకు అందాల్సిన సహాయం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందాల్సిన వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నాం. త్వరలోనే నిధులు వస్తాయని భావిస్తున్నాం.

ఫోటో న్యూస్



జనవరి మొదటి వారంలో నిండుకుండలా..



మార్చి మొదటి వారంలో కొద్దిపాటి నీళ్లతో ఇలా..



ప్రస్తుతం ఎడారిగా మారిన ప్రాజెక్టు

ఎడారిగా మత్తడి వాగు ప్రాజెక్టు

తాంసి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నిండుకుండలా కనిపించే మత్తడి వాగు ప్రాజెక్టు పూర్తిగా అడుగంటి పోయింది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ఎడారిని తలపిస్తుంది అంటే అందులో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇంకా మూడు నెలల వేసవికాలం ఉండగానే నీరంతా అడుగంటి పోయింది. దీంతో రానున్న రోజుల్లో పశువులకు తాగేందుకు కూడా ఆ ప్రాజెక్టులో నీరు కరువుతుందే మోనని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు నీటితో నిండుకుండలా కనిపించే ఆ ప్రాజెక్టు పూర్తిగా ఎండిపోవడంతో వచ్చిపోయే వాళ్ళు ఆసక్తిగా చూస్తున్నారు. మండుతున్న ఎండలకు తోడు భూగర్భ జలాలన్నీ పూర్తిగా అడుగంటిపోయాయి. దీంతో ప్రాజెక్టు కింది రైతులు తమ పంటకు నీళ్లు ఇచ్చేందుకు కూడా సరిపోవడం లేదంటే అందులో ఎలాంటి అనుమానం లేదు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు. ప్రస్తుతం మీటర్ నీళ్లు కూడా లేవు.



ఏకరూప దుస్తులు లేని విద్యార్థులు

విద్యా సంవత్సరం ముగుస్తున్నా

విద్యార్థులకు అందని ఏకరూప దుస్తులు

బోథ్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టించాలని అందుకు అవసరమైన బట్టను పాఠశాల ప్రారంభం కంటే మొదలు గాని సరఫరా చేసింది. అయితే అధికారులు మహిళా సమైక్య వారితో పాటు పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఇంతవరకు ఏకరూప దుస్తులకు విద్యార్థులు నోచుకోలేదు. అయితే డ్రెస్‌లకు అవసరమైన బట్టను పంపడంతో పాటు స్టిచ్చింగ్ చార్జీలను సైతం ప్రభుత్వం నుంచి ప్రధానోపాధ్యాయుల పాఠశాల అకౌంట్లో జమ చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పాఠశాల ముగిసి పోస్తున్న ఈ ఏడాది ఏకరూప దుస్తులకు విద్యార్థులు నోచుకోలేదు. ఈ విషయంలో అధికారులు విచారణ చేపడితే వాస్తవాలు బయటపడే ఆస్కారం ఉంది.

ముథోల్‌లో రసవత్తరంగా కుస్తీ పోటీలు

● తరలివచ్చిన మల్లయోధులు



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

ముథోల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్ లోని జర శంకర్ ఆలయం సమీపాన శనివారం మధ్యాహ్నం కుస్తీ పోటీలను ఘనంగా నిర్వహించారు. ప్రతీ సం వత్సరం హనుమాన్ జయంతి పురస్కరించుకొని ముథోల్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ కుస్తీ పోటీలను నిర్వహిస్తారు. సుమారు లక్ష రూపాయలతోని ఈ కుస్తీ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాలోని ఆయా గ్రామాల నుండి మల్లయోధులు తరలింవచ్చారు. ముథోల్ సీఐ మల్లేష్ నేతృత్వంలో ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముథోల్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు విఠల్, నాగేష్, వెంకటేష్, దశరథ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రోళ్ల రమేష్, కే. నారాయణ, సాయినాథ్, సోమేష్ పటేల్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయం.. నర్సాపూర్ (జె)

ఆంధ్రజ్యోతి పరిశీలన

● తాగునీటికీ ఇబ్బందులే! ● పూర్తికాని వంతెన నిర్మాణం



నర్సాపూర్ (జె) గ్రామం



నర్సాపూర్ (జె)లో పనిచేస్తున్న ఒకే ఒక్క బోరుబావి



వంతెన నిర్మాణం నిలిచి పోయిన నర్సాపూర్ వాగు

ఉట్నూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్ జె (దమ్మన్నపేట్) గిరిజనుల సమస్యలు వర్ణాణాతీతం. గురు వారం ఆంధ్రజ్యోతి విలేజ్ విజిట్‌లో భాగంగా గ్రామాన్ని సందర్శించి స మస్యలను తెలుసుకుంది. దశాబ్దాలు గడుస్తున్నా దశమారని రోడ్డు, మంచినీటి సమస్యలతో గిరిజనులు సతమతం అవుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఈ గ్రామాన్ని సందర్శించిన నేటికి ఆ గ్రామ ప్రజల సమస్యలు తీరడం లేదు.



కాలినడకన వెళ్తున్న గ్రామస్థులు

మూడు బోర్లు ఉన్న, ఒకే బోరు పని చేస్తుంది

నర్సాపూర్ గ్రామంలో 66 గిరిజన కుటుంబాలు కలిగి 500 పైగా జనాభా నివసిస్తుంది.గ్రామ గిరిజనులకు మంచినీరు అందించడానికి మూడు బోరుబావులు గ్రామంలో ఉన్న ఒకే ఒక బోరుబావి పని చేస్తుండడంతో మంచినీటి కోసం ఇబ్బందులు అవుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామంలో పెళ్లిలు, ఇతర విందులు ఉన్నప్పుడు మంచి నీటి కోసం ట్యాంకర్లను వినియోగించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు పేర్కొంటున్నారు. మూడు బోరుబావుల్లో పైపులు వేసి మంచినీరు అందేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. అదే విధంగా మిషన్ భగీరథ నీరు కూడా ట్యాంకుల వరకు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

దశాబ్దాలు గడుస్తున్న తీరని రోడ్డు సమస్య

ఐదు దశాబ్దాల కంటే ముందు నర్సాపూర్ గ్రామం ఏర్పడినప్పటికి రోడ్డు సమస్య పరిష్కారం కావడం లేదని గిరిజనులు వాపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో దంతనపల్లి నుంచినర్సాపూర్‌కు రోడ్డు నిర్మా ణానికి నిధులు మంజూరు చేసి మూడు వాగుల పై వంతెనలు మంజూరు చేసింది. ఆడగూడ సమీపంలో ఉన్న వాగుపై వంతెన నిర్మాణానికి అటవి శాఖ అడ్డంకులు చెప్పడంతో వంతెన నిర్మాణం నిలిచి పోగా మిగత రెండు వంతెనలు పూర్తి అయ్యాయి. అభివృద్ధి పనులకు అటవి శాఖ అడ్డంకులు చెప్పడంతో గిరిజనులకు కాలినడకన ప్రయాణం తప్పడం లేదు. ఉట్నూర్ నుంచి మంచిర్యాల వెళ్లే రహదారి పై దంతనపల్లిలో బస్సు దిగి నర్సాపూర్ గిరిజనులు తమ గ్రామానికి కాలినడకన చేరుకుంటున్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి

● రాధాబాయి, నర్సాపూర్




నర్సాపూర్‌లో మంచి నీటి సమస్య పరిష్కారానికి అధికారులకు కృషి చేయాలి. గ్రామంలో ఉన్న బోరుబావులకు మరమ్మత్తులు చేయించి నీళ్లు అందించాలి. అదే విధంగా మిషన్ భగీరథ నీళ్లు కూడా అందేలా చూడాలి.

నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం

● శ్రీనివాస్, డీఈఈ ఉట్నూర్

నర్సాపూర్ జెలో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. గ్రామ కార్యదర్శితో మాట్లాడి బోరుబావుల సమస్య పరిష్కరిస్తాం.



ఆ ముగ్గురు నేతలకు..
రీ ఎంట్రీ.. లేనట్లేనా?



సంజీవరెడ్డి



గండ్రత్ సుజాత



సాజిద్ ఖాన్

ఆదిలాబాద్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీలోకి ఆ ముగ్గురు నేతలకు రీ ఎంట్రీ లేనట్లేనా.. ఇక కాంగ్రెస్‌తో వారికి ఉన్న సంబంధాలు దాదాపుగా తెగిపోయినట్లేనా.. ప్రత్యామ్నాయంగా మరో పార్టీని వెతుక్కోవాల్సిందేనా.. అంటే అవుననే సమాధానాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. గతంలో కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా వ్యతిరేకించి సస్పెన్షన్‌కు గురైన ముగ్గురు సీనియర్ నేతలు సంజీవ రెడ్డి, గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్‌ల రాజకీయ భవిష్యత్‌పై జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్‌ను ఆశించి దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. అలాగే పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి వ్యతిరేకంగా ఎన్నికల్లో పని చేయడంతో పార్టీ అధిష్ఠానం ఈ ముగ్గురు నేతలపై క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. అప్పటి నుంచి రాజకీయాలకు దూరంగానే ఉంటూ వస్తున్నారు. అయితే ఎవరూ ఊహించని విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో వీరి రాజకీయ భవిష్యత్తు పూర్తిగా తలకిందులైంది. ఏకంగా ప్రెస్‌మీట్ పెట్టి మరీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేయడంతో పార్టీ మరింత సీరియస్‌గా తీసుకుంది. అయితే కాంగ్రెస్ పార్టీలో ఇవన్నీ సర్వసాధారణమే అయినప్పటికీ ఈ ముగ్గురు నేతల విషయంలో అంత కఠినంగా ఎందుకు వ్యవహరిస్తుందో అసలు అంతుచిక్కడం లేదని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

మొదలైన ప్రయత్నాలు

గతంలో కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని పని చేసిన ముగ్గురు సీనియర్ నేతలు తిరిగి కాంగ్రెస్‌లో కొనసాగేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే మళ్లీ అవకాశం కల్పిస్తారా.. లేదా అనేది పార్టీ అధిష్ఠాన నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది. పార్టీలో తమకున్న పరిచయాలు, పలుకుబడితో పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్న ముఖ్యమంత్రి నిర్ణయాన్ని కాదని పార్టీలో చేర్చుకునే పరిస్థితి ఉండదంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా స్వతంత్ర అభ్యర్థికి మద్దతుగా నిలిచి, పార్టీ అభ్యర్థి ఓటమికి కారణమయ్యారన్న ఉద్దేశ్యంతో సీనియర్ నేతలను దూరం పెట్టారు. గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో సీనియర్ నేతల మద్దతుపై కొంత వరకు చర్చ జరిగినా పార్టీలో చేర్చుకునేందుకు మాత్రం అధిష్ఠానం పెద్దలు అంతగా ఆసక్తి చూపించలేదని తెలుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచిపోయినా సీనియర్ నేతల చేరికపై ఎలాంటి స్పష్టత కనిపించడం లేదు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుందా.. లేదా.. అధిష్ఠానం పెద్దలు యూటర్న్ తీసుకుంటారా.. అనే దానిపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ నిర్ణయమే ఫైనల్‌గా మారే అవకాశం కనిపిస్తోంది.

- కాంగ్రెస్‌లో తిరిగి చేరేందుకు జిల్లా సీనియర్ నేతల ప్రయత్నాలు
- ఇప్పటికే రెండు సార్లు రిజెక్ట్ చేసిన పార్టీ అధిష్ఠానం
- ఎటూ తేలని ముగ్గురు నేతల రాజకీయ భవిష్యత్తు
- పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ నిర్ణయమే ఫైనల్

పట్టుబడుతున్న కంది

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సీనియర్ నేతలపై సస్పెన్షన్ వేటు ఎత్తివేసే ప్రయత్నాలు జరిగాయి. అయితే నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి మాత్రం పట్టుబట్టి మరీ ఆదేశాలను రద్దు చేయించినట్లు ప్రచారం జరిగింది. ఇప్పటికే రెండుసార్లు సస్పెన్షన్ వేటు ఎత్తివేస్తున్నట్లు పార్టీ ఆదేశాలు జారీ చేసినా, తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో మళ్లీ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డితో కలిసి పార్టీ అధిష్ఠానం పెద్దలను ఒప్పిస్తే నేతల చేరికపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందంటున్నారు. కానీ నియోజకవర్గ ఇన్‌చార్జీతో సీనియర్ నేతలకు తీవ్ర విభేదాలు ఉండడంతో ఇప్పుడున్న పరిస్థితిలో అది సాధ్యమయ్యే పని కాదంటున్నారు. అయితే రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు అంటూ ఎవరు ఉండరన్న అభిప్రాయాలు కూడా లేకపోలేదు. ప్రధానంగా కాంగ్రెస్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితులు ఉంటాయని సొంత పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారంలోకి రాగానే పార్టీకి దూరం

కొన్నేళ్లుగా పార్టీనే నమ్ముకుని పని చేసిన సీనియర్ నేతలు చివరకు పార్టీ అధికారంలోకి రాగానే దూరమైపోయారు. ఓ చిన్న పార్టీ నిర్ణయంతో నేతల రాజకీయ భవిష్యత్తే పూర్తిగా మారిపోయింది. పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రతిపక్ష హోదాలోనే కొనసాగుతున్నారు. అధిష్ఠానం పెద్దల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్న సీనియర్ నేతలపై అనుచరుల ఒత్తిళ్లు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల వరకు చూసి ఆ తర్వాత ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే ఇతర పార్టీల నుంచి పిలుపు వచ్చినా ఏమీ చెప్పలేని పరిస్థితి ఉందంటున్నారు. రాజకీయాల్లో ఎప్పుడు ఏమి జరుగుతుందో ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితులు ఉంటాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏదైనా అవకాశం వస్తే ఇతర పార్టీలో చేరిపోవడమే మంచిదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎన్నాళ్లు పార్టీలో ఉన్నా పట్టించుకునే వారే లేకపోవడంతో సీనియర్ నేతలను నమ్ముకున్న కార్యకర్తలు దూరమైపోతున్నారు. ఇప్పటి కొంత మంది ముఖ్య అనుచరులు దూరమయ్యారు. ఇదే పరిస్థితి మరి కొన్నాళ్ల పాటు ఉంటే ఆదరణ తగ్గి ఒంటరిగా మిగిలిపోయే ప్రమాదం ఉందన్న టాక్ కూడా వినిపిస్తోంది.

రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డీఆర్‌ఎం



డీఆర్‌ఎంకు స్వాగతం పలుకుతున్న ఎంపీ

ఆదిలాబాద్‌రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైల్వేస్టేషన్‌ను డీఆర్‌ఎం ప్రదీప్ కాంబ్లే శనివారం సందర్శించారు. ఆయనను ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అనంతరం పెండింగ్ ప్రాజెక్టులపై సమావేశం నిర్వహించారు. అదనపు రైలు పొడిగింపు, రైల్వే అండర్ బ్రిడ్జి, ఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

శోభాయాత్రకు భారీ బందోబస్తు : ఎస్పీ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ శోభా యాత్రకు జిల్లాలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. 300 మంది సిబ్బందితో బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వీడియో కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో, ప్రత్యేక సీసీ టీవీలతో పర్యవేక్షణ ఉంటుందన్నారు. ర్యాలీ పూర్తయ్యేంత వరకు హనుమాన్ విగ్రహానికి ఇరువైపులా పోలీసు సిబ్బంది ఉంటారన్నారు. అదేవిధంగా ర్యాలీ జరిగే ప్రదేశాల్లో ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందని సూచించారు.

'గిరి పిల్లల భవిష్యత్తు కోసం పోరాడుదాం'



పెందుర్ సంతోష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నార్నూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : తుడుందెబ్బ అనుబంధ సంఘం విద్యార్థి సంఘం నూతన జిల్లా అధ్యక్షులు ఎన్నికైన పెందుర్ సంతోష్‌ను శనివారం గాదిగూడ మండలంలోని ఫునగూడ గ్రామస్తులు శాలువా కప్పి సన్మానం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో చాలా వరకు విద్యార్థులకు సరైన విద్య అందడం లేదని గ్రామస్తులు విన్నవించారు. దీనికి స్పందించిన సంతోష్ మాట్లాడుతూ కచ్చితంగా గిరిపిల్లల భవిష్యత్ కోసం పోరాటం చేస్తా అని, వారికి న్యాయం చేసే దిశగా పోరాడి సమస్య పరిష్కారం చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెందుర్ రమేష్ పటేల్, మాధవ్ రావు, తుకారాం, కిస్తు, జంగు, దుర్గారావు, గంగారాం, యూత్ నాయకులు కోసోరావు రవీందర్ నాగేందర్, కిషన్ వామన్ పాల్గొన్నారు.

సమస్య ఏదైనా సత్వరమే పరిష్కారం

● బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

తాంసి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సమస్య ఏదైనా తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరించేలా కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని బోడగుట్ట సమీపంలో ఉన్న అభయ అంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో లేకపోయినా తన నిధుల నుంచి బోథ్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కోసం సహకరించాలని కోరారు. ముఖ్యంగా యువత స్వచ్ఛందంగా తన వంతు సహకారం అందించాలని, అప్పుడే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతిగ్రామంలో కూడా హైమాస్‌లైట్లను ఏర్పాటు చేస్తున్నామని, దీనికోసం ప్రతిఒక్కరూ సహకారం అందించాలని కోరారు. బోథ్ నియోజకవర్గంలో ఉన్న ప్రతి గ్రామంలో కూడా రోడ్ల నిర్మాణాలు, మురికి కాలువలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. యువత స్వచ్ఛందంగా తమ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఆలయాలకు వెళ్లడం వల్ల మనసుకు శాంతితో పాటు సౌభాగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన గుప్త హనుమాన్లు దంపతులు, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రవీణ్, నవీన్, సుమన్ ఉన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



పరీక్షను పరిశీలిస్తున్న జిల్లా బీసీ అభివృద్ధి అధికారి

మావల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ఉచితశిక్షణ కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 104 మందికి గాను 50 మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ మేరకు పరీక్ష ఫలితాలను 15వ తేది ప్రకటించి త్వరలో హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు బీసీ సంక్షేమాధికారి రాజలింగు పేర్కొన్నారు. కార్యక్రమంలో నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.పున్నారావు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.ప్రవీణ్‌కుమార్, ఆన్‌లైన్ సెంటర్ ఇన్‌చార్జి కృష్ణ పాల్గొన్నారు.

కట్టర్లతో చోరీకి యత్నించిన ముఠా అరెస్ట్

● ఎస్పీ అఖిల్ మహాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, ఏప్రిల్, 12 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ గ్రామీణ మండలం రామాయి గ్రామంలో గత ఏడాది డిసెంబర్ 12వ తేదీన తెలంగాణ గ్రామీణ బ్యాంకులో చోరీకి విఫలయత్నం చేసిన నిందితులను అరెస్ట్ చేశారు. కన్నం వేసి లోపలికి ప్రవేశించిన దుండగులు బ్యాంకులో అమర్చిన అలారాం సైరన్ రావడంతో పారిపోయారు. ఆ కేసుకు సంబంధించిన నిందితులు పట్టుబడ్డారు. ఆ రోజు నుంచి ఇప్పటి వరకు ప్రత్యేకబృందం దొంగల కోసం అన్వేషిస్తూ ఉండగా ముగ్గురు నిందితులు పట్టుబడ్డారని ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఈ కేసులో మొత్తం 9 మంది నిందితులపై ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు చేశామన్నారు. చోరీలకు పాల్పడిన వారిలో చవాన్ రవి, సన్నీ(సుక్దెవ్), పుష్ప పవన్, గోవిందడు కార్తీక్, దగట్‌సాయి సెంబేటి, మణికంఠ, జాదవ్‌రాజు, అశోక్, మినుగు రాజేశ్వర్‌లు ఈ నేరానికి పాల్పడగా అందులో ముగ్గురువ్యక్తులు శనివారం ఆదిలాబాద్ గ్రామీణ మండలం కచకంటి గ్రామ శివారులో పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు పట్టుకోగా నేరం అంగీకరించారు. వారి వద్ద నుంచి బ్యాంకు చోరీకి ఉపయో గించిన గ్యాస్ సిలీండర్, కట్టర్, గడ్డపార స్వాధీనపరుచుకుని నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహ రించి దొంగలను పట్టుకున్న సీసీఎస్ సీఐ చంద్ర శేఖర్, రూరల్ సీఐ ఫణీందర్, ఎస్సై ముజా హిద్, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్ర మంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీసీఎస్ సీఐ చంద్ర శేఖర్, రూరల్ సీఐ ఫణిందర్ పాల్గొన్నారు.

హనుమాన్ పల్లకీసేవలో ప్రముఖులు



పూజలు నిర్వహిస్తున్న ఎంపీ నగేష్



పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఆదిలాబాద్‌రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్ కాలనీలో గల శ్రీపంచముఖి హనుమాన్ ఆలయంలో శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని స్వామివారి పల్లకి మోశారు. అనంతరం జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన బీజేపీ నాయకులు, కాలనీవా సులు ఉన్నారు.

● హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు

తలమడుగు : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని అతిపురాతనమైన కోసాయి రీట హనుమాన్, సుంకిడిలోని తిరుమల స్టోన్‌క్రషర్, సంకట యోజన వీర హనుమాన్ ఆలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆదిలాబాద్ ఎంపీ నగేష్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జోగురామన్న కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్, తాంసి ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజు, తిరుమల స్టోన్ క్రషర్ యజమాని గుట్ట హనుమాన్లు, గుట్ట ప్రవీణ్, గుట్ట నవీన్, గుట్ట సుమన్, టీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేష్, పిడుగు అభిరామిరెడ్డి. బీజెపి సీనియర్ నాయకులు చంద్రకాంత్, వెంకటస్వామి, ప్రభాకర్, మహేందర్ యాదవ్, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోనే ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో సహ భక్తి భోజనాలు చేశారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక మార్గము నడుచుకోవాలని కోరారు.



పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఉట్నూర్ : ఉట్నూర్ ఏజెన్సీలోని గ్రామాల్లో గ్రామ గ్రామన శనివారం హనుమాన్ ర్యాలీ కార్యక్రమాలు భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉట్నూర్ మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయం ప్రాంగణంలో ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్, ఏఎస్పీ కాజల్ సింగ్ హనుమాన్ చాలీసా పారాయణం అనంతరం ర్యాలీని ప్రారంభించారు. హనుమాన్‌భక్తుల ఆధ్వర్యంలో జరిగిన శోభాయాత్రలో 150 డప్పులతో ప్రారంభమైన శోభా యాత్రను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఉట్నూర్ పట్టణంలోని ప్రధాన రహదారిపై డప్పుల శబ్దాల తోపాటు డీజే సౌండ్స్‌తో భక్తులు ర్యాలీలో పాల్గొని కేరింతలు కొట్టా రు. డాక్టర్ సాదిగే రాజగోపాల్, లింగన్న పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా మండలంలోని గంగన్నపేట హనుమాన్ ఆలయం ఆవరణలో భక్తులు మాజీ సర్పంచ్ మరుసుకోలా తిరుపతి ఆధ్వర్యంలో సీత గొంది ఆత్రం గంగాధర్, గొల్లపల్లి శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో జెండావిష్కరణ చేశారు.

చెక్‌డ్యాంకు మరమ్మతులు



కోతకు గురైన చోట మట్టి నింపుతున్న కార్మికులు

బోథ్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంచినీటి ఎద్దడి రోజు రోజుకు తీవ్రమవుతోంది. పదిసంవత్సరాల క్రితం నిర్మించిన చెక్‌డ్యామ్ ఎప్పుడూ నీటితో నిండి ఉండేది. అయితే భారీవర్షాల వల్ల కోతకు గురికావడంతో చెక్‌డ్యామ్ పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. నీటి కరువు పోవాలంటే పారే నీటిని నిలుపుకోవాలన్న ఆలోచన వచ్చింది. దాంతో గ్రామపంచాయతీ వారు కోతకు గురైన చెక్‌డ్యామ్‌ను శనివారం పూడ్చివేసి నీటిని నిలిచేలా చేస్తున్నారు.

తాంసిలో పిచ్చి కుక్కల దాడి



గుంపులుగా ఉన్న కుక్కలు

తాంసి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాడి గ్రామంలో మూడు రోజుల నుంచి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో మూడు రోజుల వ్యవధిలోనే 12 మందికి కుక్కలు గాయాలపాలు చేశాయి. 16 మేక పిల్లలను చంపాయి. ఒక లేగ దూడపై దాడి చేశాయి. దీంతో గ్రామస్తులు భయందోళనకు గురవుతున్నారు. వందలాది కుక్కలు తమ గ్రామంలో సంచరిస్తున్నాయని, కానీ ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కుక్కలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంజాయి పట్టివేత.. ఒకరిపై కేసు నమోదు



పట్టుబడిన గంజాయి

బోథ్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిగిని గ్రామానికి చెందిన పెందూర్ ప్రభు అనేవ్యక్తి ఇంట్లో నిలువ ఉంచిన గంజాయిని పట్టుకున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. పక్కాసమాచారంతో నిగిని గ్రామానికి చెందిన పెందుర్ ప్రభు ఇంట్లో సోదాలు నిర్వహించగా రూ.36,250ల విలువైన గంజాయి దొరికిందన్నారు. ఈ మేరకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. గంజాయి సేవించిన, సాగుచేసినా విక్రయించినా కఠినచర్యలు తప్పవని సీఐ పేర్కొన్నారు. గంజాయిని పట్టుకోవడంలో ప్రతిభ చూపించిన ఎస్సై ప్రవీణ్ కానిస్టేబుల్ అంబాజీ, రంజిత్‌కుమార్, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అభినందించారని సీఐ పేర్కొన్నారు.